# వినయ, విధేయతలులేని విద్యలన్నీ రాక్షస విద్యలే!

బహుళ విద్యలయ్యె వాంఛలు మితిమీరె
పలుకులందు హీరొ పనికి జీరొ
తెలివితేటలన్ని కలిగి లాభంబేమి?
కొంచెమైన ఆచరించరయ్య!

భోగభాగ్యంబులవి యెన్ని పొందియున్న
తృప్తి మనిషికి లేదని తెలియరయ్య
ఆత్మతత్త్వంబు తెలిసికొన్నప్పుడెగాని
తృప్తి శాంతియు మనిషికి ప్రాప్తమగును.

ప్రేమస్వరూపులైన విద్యార్థులారా!

ప్రపంచములో ఏ పదార్థము చూచినను మానవునకు భయాందోళన కలిగించుచున్నది. ఒక్క వైరాగ్యము మాత్రమే మానవునకు అభయత్వమును అందించుచున్నది. లోకములో మానవులు యీ పరమ సత్యాన్ని గుర్తించుకొనలేక అనేక విధములైన వాంఛలను అభివృద్ధిగావించుకొనుచున్నారు. మానవునకు దేహముపై అభిమానముండినంతవరకు దృశ్యవస్తువులపైన మమత్వము తప్పదు. మమత్వము వుండినంతవరకు మానవునకు అశాంతి వుండియే తీరును. కనుక, యిట్టి అభిమానమును, మమత్వమును త్యజించే నిమిత్తమై ప్రాచీనకాలమునందు వేదకాలమునందుకూడను విద్యనభ్యసించటానికి ప్రయత్నించారు, ఋషులు. నిగ్రహశక్తియే వినయమునకు ప్రధాన గుర్తనియు, వినయమే విద్యకు ప్రాణమనియు, ఆనాటి ఋషులయొక్క విశ్వాసము.

**కాలకర్మకారణ కర్తవ్యాలు మారిపోవటంచేత 'దమ' అనే పదము 'మద'గా మారిపోతూ**

sri sathyasai vachanamrutam

వచ్చింది

వినయము కలుగవలెనన్న యింద్రియ నిగ్రహము అత్యవసరము. ఇంద్రియనిగ్రహము నిమిత్తమై విద్యను అభ్యసించవలెను. కనుకనే ప్రాచీన కాలమునందు యింద్రియనిగ్రహముతోబాటు ఆర్జించిన విద్యకే ఘనతనిస్తూ వచ్చారు. ఇంద్రియనిగ్రహమునకు 'దమము' అని పేరు. కానీ, కాలకర్మకారణ కర్తవ్యాలు మారిపోవటంచేత యీనాటి విద్యార్థులందు 'దమ' అనే పదము తిరగబడిపోయి 'మద' గా మారిపోతూ వచ్చింది. కారణమేమనగా, విద్యార్థులందు వుండవలసిన వినయవిధేయతలు శూన్యమైనాయి. ఇంద్రియ లోలత్వమే విద్యార్థిదశకు ప్రాణముగా విశ్వసిస్తూ వచ్చారు. కాదు, కాదు, యింద్రియ నిగ్రహమే విద్యార్థులకు ప్రధాన సూత్రము. ప్రాచీనకాలములో యింద్రియనిగ్రహముతో అభ్యసించిన విద్యలకు 'సాక్షర' అని సంస్కృతపదమును వారికి బిరుదుగా అందిస్తూ వచ్చారు. 'సాక్షర' అనే సంస్కృత పదములో వుండే అంతరార్థము, వినయ విధేయతలతో యింద్రియనిగ్రహము కలిగి తమ దివ్యత్వమును గుర్తించిన వ్యక్తి అని. దమము మదముగా మారినప్పుడు సాక్షర అనే పదము త్రిప్పి చదివినప్పుడు రాక్షస అనే రీతిగా మారుతూ వచ్చింది. కనుక, దమముతో సాధించిన విద్యావంతుని 'సాక్షర' అనియు, దమములేక అభిమాన మమకార అహంకారములచేత అభ్యసించిన విద్యావంతునకు 'రాక్షస' అని పేరు పెడుతూ వచ్చారు. కేవలము పండితుడైనంత మాత్రమున చాలదు. అంగఉపాంగములను అధ్యయనము చేసి గొప్ప సంస్కృత పండితుడని పేరు పొందినప్పటికిని దమమే లేకుండిన, వినయ విధేయతలే లేకుండిన యీ విద్యలన్నీ రాక్షస విద్యలే అని ఆనాడు ప్రబోధిస్తూ వచ్చారు.

**విద్య విజ్ఞానముకొరకే!**

వేదకాలమందు అనేక రకములైన విశ్వాసములు కలిగినప్పటికిని మానవత్వము కలిగి, దివ్యత్వమును విశ్వసించి, పవిత్రతను ఆశించి, వారు నిత్య జీవితము గడుపుతూ వచ్చారు. కానీ, సాంకేతిక, విజ్ఞాన శాస్త్రములు అభివృద్ధి అయినకొలది క్షణములో ప్రపంచమునే భస్మము గావించే యంత్రములు కనిపెడుతూ వచ్చారు. యింతటి మహత్తరమైన శక్తిని

sri sathyasai vachanamrutam

కనిపెట్టిన వైజ్ఞానికుడుకూడను శాంతిని పొందలేకపోతున్నాడు. పంచభూతములను హస్తగతముగావించుకొని వాటితో ఆటలాడుతున్న వైజ్ఞానికుడు నిర్భయంగా జీవించలేకపోతున్నాడు. సామాన్య మానవునకున్న శాంతిభద్రతలుకూడను వైజ్ఞానికునికి లేక తన జీవితమును హాస్యాస్పదము గావించుకుంటున్నాడు. జీవితమే అస్తవ్యస్తముగా మారిపోతూ వచ్చింది. దీనికి కారణమేమనగా, యీనాటి విద్యలు కేవలము జీవనోపాధి నిమిత్తము. ఉద్యోగములు ఆశించి ఎక్కే గుమ్మము, దిగే గుమ్మముగా తయారౌతున్నారు. విద్యకు, ఉద్యోగమునకు సన్నిహిత సంబంధభాంధవ్యమును పెంచుకుంటున్నారు. విద్య విజ్ఞానముకోసమనే సత్యాన్ని గుర్తించాలి.

**ఆత్మను వెతుకవలసిన మానవుడు అన్నమును వెతుకటానికి ప్రయత్నిస్తున్నాడు**

ఈనాటి లోకములో మానవుడు రెండు విధములుగా కనుపిస్తున్నాడు. ఒకడు దురాశపరుడు-రెండవవాడు ఆశలేనివాడు. ఆశలేనివాడు సమస్త ప్రపంచమును తృణప్రాయముగా చూస్తాడు. ఆశకలిగినవానికి మేరు పర్వతము నిచ్చినప్పటికిని సంతృప్తిపడలేడు. ఒకానొక సమయములో ఒక సాధకుడు బ్రహ్మను ప్రశ్నించాడు: 'బ్రహ్మగారు! మీరు యీ మేరు పర్వతము ఎందుకోసం సృష్టించారు, ఎవరికోసం సృష్టించారు?' అని. "నాయనా! రామాయణములో ఒక విచిత్రమైన వ్యక్తి వుంటున్నాడు. అతని రూపము మహా విచిత్రమైనది. అతనికి శిరస్సులేదు. అనగా లేకపోలేదు, భుజములపైన వుండవలసిన శిరస్సు కడుపుపైన వుంటున్నది. అతని పేరే కబంధుడు. అతనియొక్క శిరస్సు, మేధస్సు, సర్వము కడుపుకై పాటుపడుతున్నవి. తన తలను కడుపు నిమిత్తమై వినియోగించాడు. అతనికి 'కడుపే కైలాసం'. తన జీవిత పరమార్థ నిమిత్తమై యేమాత్రము చింతించక కేవలము కామారాధనలందే తన జీవితము అంకితము గావించుకున్నాడు. తన విశాలమైన హస్తములచేత అందిన పదార్థములన్నింటినికూడను తన పొట్టకోసమే అందిస్తున్నాడు. యిలాంటి వ్యక్తులు మున్ముందు రాబోతున్నారు. తాము చదివిన విద్యలుగానీ, నేర్చిన విజ్ఞానముగానీ, మేధాశక్తిగానీ సర్వముకూడను కేవలము కడుపు నిమిత్తమై వినియోగించడానికే పాటుపడుతున్నారు, నేడు. సమస్తమైన విజ్ఞాన,

srisathyasaivacheramrutam

సుజ్ఞాన, ప్రజ్ఞానములుకూడను కడుపునకే అంకితమవుతున్నాయి. యిదికాదు, విద్యయొక్క ప్రధానలక్ష్యము. కడుపునిచ్చిన భగవంతుడు ఆహారము నివ్వకమానడు. ఆత్మను వెతకవలసిన మానవుడు అన్నమును వెతకటానికి ప్రయత్నిస్తున్నాడు. ఈనాటి లోకములో మూడుభాగములు కబంధులుగానే కనుపిస్తున్నారు కానీ విద్యావంతులుగా కనుపించటంలేదు. ఏ ఆటలు ఆడినా, ఏ పాటలు పాడినా, ఏ మాటలు చెప్పినా అన్నింటియందుకూడను తనయొక్క స్వార్థము, స్వప్రయోజనము నిండి ఉంటాయి. కనుక, మానవత్వములోపల వుండిన యీ బలహీనతను ఎత్తి చూపించే నిమిత్తమై యీ మేరు పర్వతమును సృష్టించాన"న్నాడు.

**భగవంతునికి ఏమాత్రము అర్పితము చేయకుండా, అందుకోవటానికి సిద్ధపడుతున్నారు**

లోకములో రెండు విధములైన మార్గములున్నవి. రెండు విధములైన అధికారములుకూడా వున్నవి. ఒకటి బాధ్యత, రెండవది కర్తవ్యము. యిదే Right and Responsibility. కానీ, యీనాడు మానవుడు తనయొక్క హక్కులకు మాత్రమే అఱ్ఱులు చాచి అనేక విధములుగా పోరాడుతూ ముందంజ వేస్తున్నాడు. కానీ, బాధ్యతను గుర్తించటానికి ప్రయత్నించటం లేదు. నైతిక, భౌతిక, ధార్మిక, ఆధ్యాత్మిక, వైజ్ఞానిక, ఆర్థిక పరిస్థితులందుకూడా యీనాటి మానవుడు తన బాధ్యతను యేమాత్రముకూడను గుర్తించటానికి ప్రయత్నించటంలేదు. ఉన్నత పదవి కావాలి. సరైన జీవితము అందుకోవాలి. జీతము అధికము కావాలి. ఈవిధమైన వాంఛలచేత తన జీవితమును వ్యర్థము గావిస్తున్నాడు. కానీ, 'నేను అందుకునే జీతమునకు తగినంత పని చేస్తున్నానా? నాయొక్క కర్తవ్యమును నేను నిర్వర్తిస్తున్నానా? నా బాధ్యత నేను పాటిస్తున్నానా?' అనే ప్రశ్నలు వేసుకోటానికి అతనికి కాలం చిక్కడంలేదు. కేవలము లౌకిక రంగమునందేకాక ఆధ్యాత్మిక రంగమునందుకూడను యీ విధమైన పొరపాట్లు చేస్తూ మానవుడు పెడమార్గము పడుతున్నాడు. 'నాకు భగవంతుడు కావాలి, నాకు ముక్తి కావాలి, నాకు యోగక్షేమములు కావాలి,' అని ఆశిస్తున్నాడు, మానవుడు. కానీ, దానికి తగిన ప్రయత్నములు చేయటంలేదు. 'నాకు భజనకు యేమాత్రము అవకాశంలేదు. సాధనలు

sri sathyasai vachanamrutam

నేను చేయలేను. భగవంతుని నేను చింతించలేను. కానీ, నాకు భగవంతుడు కావాలి,' యీయొక్క సంకుచితమైన బుద్ధి కలిగిన మానవుడు తన బాధ్యత యేమిటి అనే విచారణ చేయలేకపోతున్నాడు. ఏదైనా ఒక షాపుకి వెళ్లినప్పుడు, ఏదైనా ఒక వస్తువు మనం కొనాలని ఆశించినప్పుడు, ఆ వస్తువుకు తగిన మూల్యమునందించినప్పుడే ఆ వస్తువు మన హస్తానికి చిక్కుతుంది. ఆ మూల్యమే అతనికి అందించనప్పుడు ఆ వస్తువు మనము అందుకోలేము. అదే విధముగనే, యీనాటి మానవుడు భగవంతుని యోగక్షేమములందించమని కోరుతున్నాడు. ముక్తిని ఆశిస్తున్నాడు. నిరంతరము శాంతిసుఖసౌభాగ్యములను కోరుతున్నాడు. ఈ ఫలితమునకు తగిన మూల్యమునందించటానికి సిద్ధముగా వున్నాడా? ఈ యోగక్షేమములకు తగిన త్యాగాన్ని భగవంతునికి మూల్యముగా అందిస్తున్నాడా? శాంతిసంతోషసౌభాగ్యములందుకోటానికి తగిన 'ప్రేమ' అనే మూల్యమును భగవంతునికి అందిస్తున్నాడా? మూల్యమును అందించక పదార్థమును మాత్రము ఆశిస్తున్నాడు. భగవంతుడు అంత తెలివితక్కువవాడు కాదు. ప్రతిదానియందు విజయము, దానికి తగిన కృషి అన్నింటిని అందిస్తూవచ్చాడు. దేనినైనా ఒక దానిని భగవంతునికి అర్పితము చేసినప్పుడే భగవంతునినుండి సుఖసంతోషములు, సౌభాగ్యములు పొందటానికి అర్హులమవుతాము. కానీ, భగవంతునికి యేమాత్రము అర్పితము చేయటానికి సిద్ధముగాలేము. అందుకోటానికి మాత్రం సిద్ధముగా వుంటున్నాం. కనుక, 'పలుకులకు హీరో పనులకు జీరో.' ఈ విధమైన వికారమార్గము యీనాడు విద్యావిధానములో అభివృద్ధి గాంచటంచేతనే 'విద్యార్థులు' అనే పదమునకు అర్హతను కోల్పోతున్నాము.

కష్టములకు కృంగటము, సుఖములకు పొంగటము, పరులకు ఎన్నైనా ఉపదేశములు చేస్తున్నారేగానీ ఆ చేసే దానిలో తాను ఎంతవరకు అచరిస్తున్నాడు? పరులను త్యాగము చేయమని చెప్పి బోధిస్తున్నారేగాని, తాను ఎంతవరకు త్యాగము చేస్తున్నాడు? ఎవరైనా మనవద్దనుండి అందుకున్నదానికి కృతజ్ఞత మనకు అందించాలని ఆశిస్తున్నామేగానీ మనము అందుకున్నదానికి ఏమి కృతజ్ఞతను అందిస్తున్నాము? ప్రపంచములోవున్న సమస్త విషయములను విచారణచేసి కేవలము తృప్తి పొందటము మాత్రమే కాదు. తనయందు,

srisathyasaivachanamrutam

తనలోపల, తన తత్వాన్ని, తన సత్యాన్ని, తాను మొట్టమొదట విచారణ చేయటానికి పూనుకోవాలి. తన సత్యాన్ని తాను చక్కగా గుర్తించినప్పుడే యితరులయొక్క సత్యమునుకూడను తాను గుర్తించటానికి అర్హుడౌతాడు.

**ఇంద్రియములను అనుసరించటము పశులక్షణము; ఆత్మను అనుసరించటము మానవలక్షణము**

భక్తిప్రపత్తులందుకూడను యీ కలి ప్రభావముచేత అనేక విధములైన వికారములు ఏర్పడుతూ వస్తున్నాయి. ఎండుటాకు, ఉక్కుగుండు రెండూ ఒకే ప్రదేశములో వుంచినప్పుడు గాలి లేకుండిన రెండు నిశ్చలంగా వుంటాయి. కానీ పెనుగాలి వీచిన తక్షణమే ఎండుటాకు అరమైలు ఎగిరిపోతుంది. ఉక్కుగుండు మాత్రం అక్కడే నిలచివుంటుంది. ఈనాటి భక్తుల పరిస్థితికూడను యిట్లనే వుంటున్నది. నిజమైన భక్తుడు, పరిపూర్ణవిశ్వాసముగల భక్తుడు, భగవంతుని శరణాగతి పొందిన భక్తుడు, భగవంతుడే తప్ప నాకు అన్యము లేదని విశ్వసించిన భక్తుడు, ఉక్కుగుండువంటివాడు. కష్టములకు, దుఃఖములకు, విచారములకు, నిందలకు, నిష్ఠూరములకు యేమాత్రము తాను చలించడు, భ్రమించడు. కానీ మాటల భక్తులు, చంచల భక్తులు, కేవల ఆడంబర భక్తులు యీనాడు కష్టము ఏ మాత్రం కలిగినా, కించిత్తు బాధలే సంభవించినా, ఎండుటాకువలె ఎగిరిపోతున్నారు. తమ అభీష్టములే నెరవేరకుండిన అనేక విధములైన ద్వేషములను పెంచుకుంటున్నారు. తమయొక్క తప్పులను తాము యేమాత్రం గుర్తించుకోటానికి ప్రయత్నించటంలేదు. ఒక విద్యార్థి చెప్పినట్టుగా 'స్వామి మాతో మాట్లాడటంలేదు, స్వామి మావైపు చూడటంలేదు, మావైపు చూచి నవ్వటంలేదు,' అని హక్కులకొరకు మాత్రమే వారు ప్రాకులాడుతున్నారు. దీనికి యేమి కారణము? 'మన దోషములు యేమిటి? మనము ఏమి ఉల్లఘించినాము? ఏ ఆజ్ఞను మనం పెడదారిన పట్టినాము?' అని తమలో తాము విచారణ చేయటానికి యేమాత్రం పూనుకోటంలేదు. నిజముగా తమ దోషములే తాము విచారణ చేసుకున్న యీ విధమైన ఆలోచనలకు యేమాత్రము అవకాశము యివ్వకూడదు. జీవితమంతయుకూడను "మేము మానవమాత్రులము, దోషములు, తప్పులు చేయటము

sri sathyasai vachanamrutam

మా సహజము, కానీ, స్వామి క్షమించాలి" అని ప్రార్థిస్తారు. మేము మానవమాత్రులమంటున్నారు. నిజముగా మానవమాత్రులు తప్పే చేయకూడదు. ఒకవేళ తెలిసో తెలియకనో తప్పుచేస్తే తిరిగి అదే తప్పు రెండవ పర్యాయము రాకూడదు. కనుక, 'మేము మానవమాత్రులము, తప్పుచేయటము మా సహజము' అనుకోటం చాలా బలహీనమైన తలంపు. ఆ విధమైన బలహీన తలంపులు మానవునిలో యేమాత్రము ఆవిర్భవించకూడదు. 'నేను బలహీనుడనుకాదు. నేను మృగమును కాదు. నేను రాక్షసుడనుకాదు. నేను మానవుడను' అని దృఢ విశ్వాసము పెంచుకోవాలి. I am man, not animal. యీయొక్క విషయాన్ని చక్కగా విచారణ చేస్తే దోషమనేదానిని యేమాత్రము సహజమని భావించలేదు. 'నేను నరుడను.' నరుడనగా ఏమిటి? ఆత్మస్వరూపుడవే! ఈ ఆత్మకు దోషము లేమాత్రము అంటుటకు వీలులేదు. దేహాభిమానము కలగటంచేతనే యీ దుర్బుద్ధులు, దురాలోచనలు, దుశ్చింతనలు మనలో ప్రవేశిస్తున్నవి. కేవలము యింద్రియముల ననుసరించే వ్యక్తిమాత్రమే యీ విధమైన భావానికి గురౌతున్నాడు. యింద్రియములను అనుసరించటము పశులక్షణము, ఆత్మను అనుసరించటము మానవలక్షణము. కనుక, యిలాంటి బలహీనతలను నీవు సమర్థించుకునే ప్రయత్నం చేయకూడదు. ఇది మానవత్వముయొక్క సహజ సిద్ధము అయిన లక్షణమని భావించరాదు. 'యిది నాయొక్క మానసిక బలహీనతే' అని విశ్వసించాలి.

## దైవభక్తి, విశ్వాసము ఉండినప్పుడు ఇంద్రియములు మనలను ఏమీ చేయలేవు

నీవు నిరంతరము యింద్రియ నిగ్రహముకోసమని పాటుపడాలి. నిజముగా నీకు యింద్రియ నిగ్రహమే వుండినప్పుడు నీలో ఒక అద్వితీయమైన శక్తి ఆవిర్భవిస్తుంది. దీనికి ఒక చిన్న కథ వుంటున్నది. ఒకానొక సమయములోపల ఒక దేశమునకు, మన దేశమునకు బోర్డరులో వున్న స్థానములో విదేశీయులు మన దేశములో ప్రవేశించకుండా వుండటానికి కొన్ని విధములైన భద్రతలు-బందోబస్తులు చేస్తూ వచ్చారు. అప్పటికికూడను అనేకమంది విదేశీయులు యిందులో ప్రవేశిస్తూ వచ్చారు. అప్పుడు ఒక ఆఫీసరు కొంతమంది సిపాయిలతో చేరి వీరిని పట్టే నిమిత్తమై మధ్యలో ఒక కేంపు వేశాడు. ఈ కేంపు

sri sathyasai vachanamrutam

వేయటంలో వుండిన అంతరార్థము ఏమిటి? మనపైన ద్వేషముగా వుండినవారు, మన రాజ్యమును అపహరించాలని దురుద్దేశ్యము వుండినవారు మన దేశంలో ప్రవేశించకుండా వుండినప్పుడు మనకు భద్రత వుంటుంది. అలా కాకుండా మన దేశంలో ప్రవేశించటానికి ప్రయత్నిస్తున్నారు కనుక అట్టి దొంగలను పట్టాలి అనే వుద్దేశ్యముతోనే యీ భద్రతలను యేర్పరుచుకున్నారు. రాత్రి, పగలు చక్కగా పహారా తిరుగుతున్నారు. ఇంతలో ఒకరు యిందులో ప్రవేశించటానికి ఒక దొంగగా వచ్చాడు. అప్పుడు అతనిని ఒక సిపాయి పట్టాడు. యజమాని టెంటులో వుంటున్నాడు. గట్టిగ కేక వేశాడు యీ సిపాయి "సార్! సార్! నేను ఒక దొంగను పట్టాను" అన్నాడు. ఈ కేప్టెను చెప్పాడు 'వానిని తీసుకుని టెంటులోకి రమ్మని.' ఆ సిపాయి 'సార్! వీడు అక్కడకు రానంటున్నాడు' అన్నాడు. 'పోనీ నీవైనా యిక్కడకు రా' అన్నాడు. 'నన్నుకూడా వీడు వదలటంలేదు' అన్నాడు. దీని అంతరార్థము ఏమనగా సిపాయిని దొంగలను పట్టే నిమిత్తమై అక్కడ పెడితే అతడు దొంగలకు స్వాధీనమైపోయాడు. యింకవాడు ఏవిధంగా యీ దొంగలను పట్టగలడు? అదే విధంగా, యీనాడు యింద్రియములను నిగ్రహించే నిమిత్తమై విద్యను అభిసించటానికి వచ్చిన విద్యార్థులు యింద్రియములకు వశమైపోతున్నారు. సిపాయిలలోపల కొంతవరకు బలహీనత యేర్పడింది. మీరు పెద్ద పోల్జర్సుగా వుండాలి. మిమ్మల్ని హింసింపచేసే దుర్గుణములను ఒక హద్దులో పెట్టుకోవాలి. ఈ విధంగా అదుపులో పెట్టుకోలేనివారు విద్యార్థులు యేమాత్రం కాలేరు. యింద్రియములు మానవునకు పరమ శత్రువులు. వాటి యిష్టప్రకారమే అవి నడుస్తాయి. అందువలన వాటిని నిగ్రహించటానికి యేది సులభమార్గము? ఒక్క ఆధ్యాత్మికమే దీనికి సులభమార్గము. నిజముగా దైవభక్తి, విశ్వాసము మన హృదయములో వుండినప్పుడు యింద్రియములు మనలను యేమాత్రము హింసించలేవు. అట్టి భక్తి ప్రపత్తులు మనలో కొంత బలహీనమైపోవటంచేతనే యింద్రియములకు మనం వశమైపోతున్నాము. కనుక, విద్యార్థులు యే విధమైన చర్యలలో వుండినప్పటికిని మొట్టమొదట యింద్రియములు చేసే పని మంచా చెడ్డా అనే విచారణ చేసి నీ conscience కు సరైన తృప్తిగా నీవు నడచుకోటానికి ప్రయత్నించాలి.

యిక్కడ conscience దోషాలుకూడా కొంతవరకు వుంటున్నాయి. కేవలము



sri sathyasai vachanamrutam

తెలివితేటలతో పని చేసే conscience ఒకటి, హృదయముతో యోచించే conscience రెండవది. తమ తెలివితేటలను పురస్కరించుకొని తాను చేసే పని సరైనదని మూర్ఖంగా విశ్వసించటము conscience కాదు. తాను లోతుగా దిగి యిది నాకు, యీ సమాజమునకు, స్నేహితులకు సరైనదా, కాదా అనే దాన్ని చక్కగా విచారణ చేసినప్పుడు నీ conscience నీకు సరైన జవాబు యిస్తుంది. Individual conscience స్వార్థ సంబంధమైన conscience. వ్యక్తిత్వమైన conscience కాదు, సమిష్టి స్వరూపమైన conscience ను మనం విచారించాలి. Fundamental conscience ను మనం విచారించాలి. సామాజిక సంబంధమైన conscience ను మనం విచారించాలి. ఈ విధమైన విశాలమైన భావాన్ని మన విద్యద్వారా అభివృద్ధిపరచుకొని దానిద్వారా మనము చేసే పనులలో మంచా, చెడ్డా అనే దానిని విచారణ చేయటానికి పూనుకోవాలి.

**జీవితమనే ఆటలో విజయము సాధించాలంటే సదాలోచన, సత్ప్రవర్తన, సచ్చింతనలను అభ్యాసం చెయ్యాలి**

విద్యార్థులారా! మీరు అనేక విధములైన ప్రదర్శనలు చేశారు. స్పోర్ట్స్ మరియు గేమ్‌లందు అనేక అద్భుత చర్యలలో మీరు చక్కని పేరు తెచ్చారు. ఈ గేమ్స్ ఏమిటి? కేవలం ఫుట్‌బాల్, వాలీబాల్, క్రికెట్ యిలాంటివా? ఇవి కేవలము వస్తుసంబంధమైన గేమ్స్, విషయసంబంధమైన గేమ్స్. కేవలము భౌతికమైన గేమ్స్. యీ గేమ్స్ కాదు, ముఖ్యమైనవి. అయితే యివికూడను లోకానికి అవసరమే! 'యిహమును సుఖింప హేమతారక విద్య, పరమును సుఖింప బ్రహ్మ విద్య' యివి ఐహికమునకు సంబంధించిన విద్యలు కనుక యిందులో కూడను మనం పాల్గొనాలి. కానీ, యీ గేమ్స్ కాదు ప్రధానమైనవి. Life is a Game, play it. యిదే పెద్ద గేమ్. జీవితమే నీకు ఒక పెద్ద ఆట. ఈ జీవితములోపల నీవు ఉత్తీర్ణుడు కావటానికి, సత్కీర్తిని తెచ్చుకోటానికి సదభ్యాసములలో ప్రవేశించాలి. సచ్చింతన, సదాలోచన, సత్ప్రవర్తనే నీకు సరైన క్రమశిక్షణ. నీవు టెన్నిసో, క్రికెట్టో ఆడాలంటే ఎంత ప్రాక్టీసు చెయ్యాలి? ఈ విధముగా నీవు ప్రాక్టీసు చేసినప్పుడే ఆ గేమ్‌లో ఉత్తీర్ణుడౌతున్నావు. ఆ వుత్తీర్ణుడైనవాడు కొన్ని విధములైన ప్రైజులు అందుకోగలుగుతున్నాడు. అదే విధముగనే,

srisathyasaivachanamrutam

యీ జీవితమనే గేమ్‌లోపల సత్కీర్తిని పొందాలంటే, ఆశయములు నిలబెట్టుకోవాలంటే, దివ్యత్వమును సాధించాలంటే, జీవితములో సదాలోచన, సత్ప్రవర్తన, సచ్చింతన అనేవి ప్రాక్టీసు చెయ్యాలి. అవి మనం చేయటంలేదు. కనుక జీవితమనే గేమ్‌లోపల అన్ని విధాలా అపజయమును పొందుతున్నాము. ఈ జీవితమనే గేమ్‌లోపల మనం విజయాన్ని సాధించాలి. అదే నిజమైన గేమ్. కనుక, మానవుడైన ప్రతి ఒక్కడుకూడను జీవితమనే దానిని గేమ్‌గా తీసుకొని తనయొక్క నిత్యజీవితమును సాగిస్తూ పోవాలి.

**మానవుని ఆయుష్షు తరిగిపోవటానికి మూలకారణము దుర్బుద్ధులు, క్రోధము, అసూయ, అహంకారము**

విద్యార్థులారా! ప్రాచీన సాంప్రదాయములను, సంస్కృతిని మనము తిరిగి నిలబెట్టటానికి పూనుకోవాలి. మన జీవితము క్షణక్షణమునకు తరిగిపోతున్నది. వయస్సా, పెరిగిపోతున్నది. కర్తవ్యమును విస్మరిస్తున్నాము. యింక మనం సాధించేది యేమిటి? కనుక, యీ పవిత్రమైన వయస్సునందే మనం సర్వమును సాధించాలి. అసలు మానవుని ఆయుఃప్రమాణము తరగటానికి కారణం ఏమిటి? మనము యీ దేహమునకు నియమించిన కాలమును దుర్వినియోగము చేసుకుంటున్నాము. ఆయుఃప్రమాణాన్ని ముక్కలు చేసేది యేమిటి? మానవునికి నూరు సంవత్సరములు ఆయుష్షు యిచ్చినప్పటికిని, దృఢసంకల్పులుగా మనం వుంటుంటే నూరు సంవత్సరములు మనం జీవించటానికి వీలవుతుంది. కానీ, యీ నూరు సంవత్సరములు మూడు సంవత్సరములుగా మారటానికి అది మనలోనే వుంటున్నాది. పెంచుకోటంగానీ, త్రుంచుకోటంగానీ, మన హస్తంలో వుంటున్నాది. ఎట్లా! యీనాటి మానవుని ఆయుష్షు తరగటానికి మూలకారణము దుర్బుద్ధులు, దురాలోచనలు, క్రోధము, అసూయ, అహంకారము. యిలాంటి కత్తులు మన ఆయువును దినదినమునకు ముక్కలు చేస్తూ వస్తున్నాయి. దురహంకారమనేది ప్రతిదినము మానవుని ఆయుష్షును తరిగిస్తూ వస్తున్నది. ఎట్లా? ఒక ప్రత్యక్షప్రమాణము. ఒక్కతూరి మానవునకు కోపం వచ్చినప్పుడు వళ్ళంతా వేడెక్కిపోతుంది. శరీరంలో వుండిన రక్తమంతా మరిగిపోతుంది. దేహమునందలి సర్వ నరములను బలహీనముగావిస్తుంది.

sri sathyasai vachanamrutam

నరములు బలహీనతకావటంచేత దానికి సంబంధించిన అన్ని అంగములు బలహీనమైపోతాయి. ఈ బలహీనమైనప్పుడు తాత్కాలికంగా అప్పటికప్పుడే బలహీనము చేయదు. ఆరు నెలలు మనం భుజించిన ఆహారములోని శక్తిని ఒక్క క్షణములో క్షీణింపచేస్తుంది. తిరిగి ఆ శక్తిని సంపాయించుకోవాలంటే ఆరు నెలలు పడుతుంది. ఈ ఆరు నెలలలోపల మనకు ఎన్ని పర్యాయములు క్రోధము వస్తుందో చెప్పటానికి వీలులేదు. ఒక్కొక్కతూరి కోపం వచ్చినప్పుడు తరిగిపోతున్నాది, ఆయుః ప్రమాణము. నరాలు కదలిపోతున్నాయి. చాలామందికి తెలుసు. కోపం వచ్చినప్పుడు పెదిమలు అదిరిపోతాయి. కన్నులు అదిరిపోతాయి. వేళ్ళు అదిరిపోతాయి. అంతా బలహీనపడిపోతుంది. శరీరములోని ప్రతి అంగము కదిలిపోతుంది. తాత్కాలికముగా యీ కోపం వుపయోగపెట్టి మనం యేదో సంతృప్తిపడటానికి ప్రయత్నిస్తున్నామేకాని ఇది మనకు చేసే హానిని గమనించలేకపోతున్నాము. యీ కోపము ఎదుటివానికి కాదు, మనకే హాని చేస్తున్నాది. అదే విధముగనే మనలో అసూయ, ద్వేషము, అహంకారము, అభిమానము యివికూడను మానవునియందున్న శక్తులను క్రమక్రమేణా కొంత తగ్గించటానికి ప్రయత్నిస్తున్నాయి.

**శరీరము, మనస్సు, ఆత్మల చేరికయే మానవత్వము**

మానవత్వమనగా ఏమిటి? శరీరము, మనస్సు, ఆత్మ యీ మూడింటియొక్క చేరికే మానవత్వము. యిందులో ఒకటి చేయటము, రెండవది తెలుసుకోటము, మూడవది వుండటము అని దీని అర్థము. ఈ మూడింటియొక్క చేరికే నిజమైన మానవత్వము. ఎట్టి కర్మలు అచరించవలెనన్నకూడను శరీరము ముందుకు పోవాలి. మనము భుజించేదికూడను శరీరముతోనే! నిత్యజీవితములో కర్మలు ఆచరించేది శరీరము. కనుక, చేయునది శరీరము. ఐతే చేయటంమాత్రమే శరీరమునకు పరిమితం అయిపోయిందిగాని ఏది చెయ్యాలి ఏది చేయకూడదు అనే విచారణాశక్తి మనస్సులో వుంటున్నాది. తెలుసుకునే మైండులో వుండినటువంటి ఆత్మను వదలిపెట్టి కేవలము శరీరముతో కర్మలాచరించుకుంటూపోతే దీన్నే పశుత్వము అన్నారు. కనుక, చేయటమే ప్రధానము కాదు. తెలుసుకొని చెయ్యాలి. తెలుసుకునే మనస్సే మనము వుపయోగపెట్టనప్పుడు

sri sathyasai vahini amrutam

కేవలము చేయటమనేది పశుత్వముగా మారుతుంది. ఒక చిన్న ఉదాహరణము. ఒక పచ్చని పంటను పశువు చూచింది. తన ఆకలి తీర్చుకుందామని అందులో ప్రవేశిస్తుంది. అయితే, 'అరే! అక్కడ ఎవరైనా కాపలా వున్నారా? యిది ఎవరి పంట? మనం భుజిస్తే కొడతారా?' యీ విధమైన విచారణ దానికి లేదు. ఈ విచారణ లేకుండా ఆ పంటలో చొరబడటంచేత దెబ్బలకు గురైపోతున్నది. పశువుగా మారిపోవటంచేతనే మనం కష్టములకు గురైపోతున్నాము. యింక రెండవది మనస్సు. మనస్సు శాశ్వతమైన, నిత్యమైన, సత్యమైన, ఆత్మను అనుసరించక కేవలము శరీరమును మాత్రమే అనుసరించటంచేత అనగా యింద్రియములనే అనుసరించటంచేత యిది రాక్షసత్వంగా మారిపోతున్నాది. సత్యనిత్యమైన ఆత్మతత్త్వాన్ని చింతించలేకపోతున్నాది. శరీరమనస్సులు రెండు ఏకము కావటంచేతనే రాక్షసత్వముగా మారిపోతున్నాది. శరీరముతోగాని, మనస్సుతోగాని సంబంధములేక తాను ఎప్పుడూ సాక్షీభూతముగా వుండే ఆత్మతత్త్వమే దివ్యత్వముగా మారుతుంది. శరీరము, మనస్సు, ఆత్మ మూడూ చేరినవాడు మానవుడు. కేవలము శరీరమును మాత్రమే అనుసరించేవాడు పశువు. శరీర మనస్సులు రెండింటిని అనుసరించేది రాక్షసత్వము. దేనియందు సంబంధములేకుండా సాక్షీభూతముగా నిల్చి స్వస్వరూపముగా నిల్చేదే దైవత్వము. పశుత్వము, రాక్షసత్వము, దైవత్వము మూడు ఒకే మానవునియందు వుంటున్నాయి. కనుక, నీవు దేనిని ఆశిస్తున్నావో దానికి తగిన ప్రయత్నము చెయ్యాలి. నీవు మానవుడుగా జీవించటానికి ప్రయత్నిస్తున్నావా? లేక పశువుగా మారటానికి ప్రయత్నిస్తున్నావా? రాక్షసుడుగా రూపొందటానికి ప్రయత్నిస్తున్నావా? లేక ఆత్మస్వరూపుడుగా వుండటానికి ప్రయత్నిస్తున్నావా? నీ ప్రయత్నముబట్టి నీ స్థానము నీవు చేరుకుంటున్నావు. నీ మంచి, చెడ్డ స్థానములు నీ ప్రయత్నముపైన ఆధారపడి ఉన్నాయి. కనుక, నిత్యానిత్యవిషయ పరిశీలన జరిపి అందులో ప్రవేశించాలి. ఆ విధమైన మార్గము అనుసరించటానికి విద్యలవసరము.

**విద్య జ్ఞానముకొరకు, కృషి కూటికొరకు**

విద్య కేవలము పొట్టకూటి నిమిత్తముకాదు. విద్య జ్ఞానముకోసం, కృషి కూటికోసం. కనుక,

sri sathyasai vachanamrutam

విద్యార్థులారా! ప్రాచీనకాలములో మహర్షులంతాకూడను యింద్రియములను నిగ్రహించుకొని వినయవిధేయతలను చక్కగా ఆచరించి గొప్ప విద్యావంతులనే పేరును పొంది 'సాక్షరః' అనే బిరుదును వారందుకున్నారు. కనుకనే, నాటిమొదలు నేటివరకు ఆ మహర్షులయొక్క సాంప్రదాయము, మహర్షులయొక్క ఆశయాలు, మహర్షులయొక్క శాసనాలు మనము తూచ తప్పక నడచుకుంటూ వస్తున్నాము. ఇంద్రియాలను నిగ్రహించి ఆత్మవిద్యను అభ్యసించి లోకసంబంధమైన వ్యవహారములలో విజయము గాంచి మానవత్వాన్ని దివ్యత్వముగా మార్చుకున్నారు, ఆనాటి మహర్షులు. మానవులు మహర్షులు కావటానికి యీ విధమైన ప్రయత్నములే మూలకారణము. కేవలము గుడ్డలు మార్చుకున్నంత మాత్రమునకాదు, గుణము మారాలి. ఆనాటి మహర్షులు సన్యాసులుగా కాషాయ వస్త్రములు ధరించారని భావించరాదు. మనిషిమారినప్పుడే మనసు మారుతుంది. మనసు మారినప్పుడే మనిషి మారుతాడు. యీనాడు మనసు మారటంలేదు. మనిషి మాత్రం మారుతున్నాడు. అలాంటిది కాదు, మన ప్రాచీన సాంప్రదాయము. ప్రాచీన సాంప్రదాయములన్నీ ఉత్తమమైనవి, పవిత్రమైనవి. కాని, వాటిపై శ్రద్ధాభక్తులు మనకు సన్నగిల్లిపోవటంచేత వాటిని అలక్ష్యముగా చూస్తున్నాం. శ్రద్ధాభక్తులను పెంచుకోవాలి.

### మన హృదయమే క్షీరసాగరము

విద్యార్థులారా! అన్ని విద్యలకంటె ఆధ్యాత్మిక విద్య సరియైన విద్య–"ఆధ్యాత్మవిద్యావిద్యానాం" అనింది గీత. కావేరి, కావేరిగా వుండవచ్చు. గంగ, గంగగా వుండవచ్చు. యమున, యమునగా వుండవచ్చు. గోదావరి, గోదావరిగా వుండవచ్చు. గోదావరి, కృష్ణకాదు; కృష్ణ, గోదావరికాదు. కానీ, "నదీనాం సాగరోగతిః" అన్ని నదులు సముద్రములో కలుస్తాయి. సముద్రములోనే కావేరివుంది. సముద్రములోనే గంగవుంది. సముద్రములోనే యమున వుంటున్నది. సముద్రములోనే కృష్ణా, గోదావరి వుంటున్నాయి. అదే విధముగ, మనము అన్ని మార్గములు ఒక్క ఆధ్యాత్మిక మార్గములోనే ప్రవేశపెట్టాలి. విద్యామార్గముకాని, వైద్యమార్గముకాని, నైతికమార్గముకానీ, భౌతికమార్గముకానీ సర్వమార్గములను ఆధ్యాత్మిక మార్గములో ప్రవేశపెడితే యిది మహాసముద్ర రూపాన్ని

sri sathyasai vahini vachanamrutam

ధరిస్తుంది. యీనాడు మనము సంసార సముద్రములో వుంటున్నామేగాని ఆధ్యాత్మిక సముద్రములో లేము. సంసార సముద్రమును ఆధ్యాత్మిక సముద్రముగా మార్చుకోవాలి. భగవంతుడు క్షీరసాగరుడు. ఎక్కడ వుంది యీ క్షీరసాగరము? ఈ భౌతికమైన ప్రపంచములో ఎక్కడ వుంది? నిజంగా క్షీరసాగరమే వుంటే ప్రభుత్వము బాటిల్సుకంతా ఎత్తి అంత సముద్రాన్ని పూర్తి నిర్మూలము గావించేవారు. కాదు; అదికాదు క్షీరసాగరము. మన హృదయమే క్షీరసాగరము! మన హృదయమే పాలకేంద్రము. అందులోనే మహావిష్ణువు శయనించి వుంటున్నాడు. క్షీరసాగరమంటే యేమిటి అర్థము? క్షీరమనగా పవిత్రమైన తెలుపు. యింతేకాదు, ఇందులో ఒక విధమైన బలమునందించే, దివ్యత్వమును అందించే వెన్న చేరి వుంటున్నాది. ఆ వెన్నయే మానవుని హృదయములోని అనంతమైన ప్రేమతత్త్వము. ఈ ప్రేమ యీ హృదయమునుండియే ఆవిర్భవించింది. ఈ వెన్న పాలనుండే పుట్టింది. ఐతే యీ వెన్న పాలలో ఎక్కడ వుంటున్నాది? ప్రతి బిందువులో వుంటున్నాది. మన దేహములో సర్వత్ర నిండినదే యీ క్షీరమనే పవిత్రత.

**క్షీరసాగరముగా ఉండవలసిన మానవ హృదయము ఈనాడు క్షారసాగరముగా మారిపోయింది**

అలాంటి పవిత్రత నిండిన హృదయముతో చేసే కర్మలు పవిత్రంగా వుండాలి. చూసే దృష్టి పవిత్రంగా వుండాలి. వినే శ్రవణం పవిత్రంగా వుంటుండాలి. తలచే తలంపులు పవిత్రంగా వుండాలి. కానీ, యీనాడు మన చర్యలు పవిత్రమైనవిగా లేకపోవటంచేత, మనలో వున్నది క్షీరసాగరమా, క్షారసాగరమా అని కొంతవరకు విచారణ చేయవలసివస్తుంది. ఈనాడు క్షీరసాగరంగా వుండవలసిన మానవ హృదయము ఉప్పుసముద్రముగా మారిపోయింది. యిలాంటి క్షారసాగరములోపల తిమింగలములు, షార్క్‌లు, మొసళ్ళు వుంటాయి. పవిత్రమైన క్షీరసాగరమునందు ఒక్క విష్ణువుతప్ప తక్కిన యీ మృగములు అందులో ప్రవేశించటానికి వీలులేదు. అట్టివాడే క్షీరసాగరశయనుడు. భగవంతుని మనం వెతకాలంటే ఎక్కడికో పోయి వెతకనక్కరలేదు. మన హృదయ సముద్రమునందే వుంటున్నాడు. చెడ్డ అనగా ఎక్కడో వెతకనక్కరలేదు. చెడ్డకూడా

sri sathyasai vachanamrutam

మనయందే వుంటున్నది.

**నీ కర్తవ్యమును నీవు నిర్వర్తించుకుంటూపోతే నీ హక్కు నిన్ను వెతుక్కుంటూ వస్తుంది**

**దేవుడనగ వేరు దేశమున లేడు**
**దేవుడుండు తనదు దేహమందె**
**పాపమనగ వేరు పరదేశమున లేదు**
**తానుచేయు పనుల తగిలియుండు**

కనుక మన పనులు, మన తలంపులు, దృష్టి యివన్నీ పవిత్రమైనవిగా వుంటుండాలి. అప్పుడే మనము 'సాక్షర' అనే బిరుదుకు అర్హత కలిగి వుంటాము. ఈ హక్కు మనము పొందాలనుకున్నప్పుడు మన కర్తవ్యమునుకూడా నిర్వర్తించాలి. ఆ కర్తవ్యము వున్నప్పుడే హక్కు సులభంగా వస్తుంది. బాధ్యతను వదలి మనకు హక్కు మాత్రమే కావాలంటే యిది యేమాత్రము వీలుకాదు. నీ కర్తవ్యమును నీవు నిర్వర్తించుకుంటూ పోతే నీ హక్కు నిన్ను వెతుక్కుంటూ వస్తుంది. నీ హక్కుకోసం ఫైట్ చేయనక్కరలేదు. అదే నిన్ను అనుసరిస్తూవస్తుంది. యిదే మన సత్యజీవితము, యిదే మన నిత్య జీవితము! యిలాంటి మానవులుగా మనం తయారుకావాలి. వున్నారు, అలాంటి మానవులు భారతదేశంలో. భగవంతుడు మూడు పదములు చెప్పాడు. "నాయనా! అడిగితే యిస్తాను. వెతికితే చిక్కుతాను. తలుపు తడితే నేను తలుపు తెరుస్తాను". ఈ మూడు వాగ్దానములు చేశాడు. కానీ, యీనాటి మానవుడు అడుగుతున్నాడు, వెతుకుతున్నాడు, తలుపును తడుతున్నాడు. దేనిని వెతుకుతున్నాడు? దేనిని అడుగుతున్నాడు? ఏ తలుపు కొడుతున్నాడు? వీటిని మనం విచారించాలి. అడుగుతున్నాడు మానవుడు అన్నీ! ఎవరిని అడుగుతున్నాడు? దేవునికాదు, ప్రకృతిని అడుగుతున్నాడు. అందుకోసమే భగవంతుడు యివ్వటంలేదు. భగవంతుని అడిగితే భగవంతుడిస్తాడు. కానీ, ప్రకృతిని మాత్రమే అడుగుతున్నాడు. దేనిని వెతుకుతున్నాడు? భగవంతుని వెతుకుతున్నాడా? లేదు, భోగభాగ్యాలను వెతుకుతున్నాడు. కాబట్టి భోగభాగ్యాలనే అందుకుంటున్నాడు. యింక ఏ తలుపులు తడుతున్నాడు. మోక్షద్వారములు తట్టడంలేదు. నరకద్వారాలు తడుతున్నాడు. కనుక, నరకద్వారాలు తెరుచుకుంటున్నాయి, మోక్షద్వారాలు

srisathyasai vachanamrutam

మూసుకుంటున్నాయి. మనము అడగవలసినది భగవంతుని అడగాలి. వెతకవలసినది భగవంతుని వెతకాలి. మనము తట్టవలసినది మోక్షద్వారాన్ని తట్టాలి. అది మన కర్తవ్యముగాని అట్లు చేయటంలేదు మనం. భగవంతుడు చెప్పింది ఒకటి, భక్తులు చేసేది మరొకటి. తాను చెప్పిన పనులే చేస్తే మానవుడు దివ్యమైన మానవునిగా రూపొందుతాడు. కానీ తనలో కొన్ని బలహీనతలు యేర్పడటంచేత, ఆ బలహీనతలకు దాసుడై దైవమునకు దూరమైపోతున్నాడు. కనుక, దైవత్వానికి దూరం కాకూడదు. దైవానికి దూరముగా వుండటమనేది living death అన్నాడు. యీనాడు మానవుడు భగవంతుని స్మరిస్తున్నాడేగానీ భగవంతునికి దూరంగా వుంటున్నాడు. కాదుకాదు. కేవలం చింతించటం మాత్రమేకాదు, ఆశించటం మాత్రమేకాదు, అర్పితముగావించాలి. అప్పుడే 'బ్రహవిత్ బ్రహ్మైవ భవతి' రెండూ ఒక్కటౌతాయి. ఇది బొగ్గు, యిది అగ్ని. అగ్ని ఒక చోట, బొగ్గు యింకోచోట వుంటుంటే అగ్ని బొగ్గులో ప్రవేశించదు. ఈ బొగ్గును అగ్నికి సమీపంగా చేర్చాలి. ఎంత సమీపంగా వుంటుందో, యీ అగ్ని అంత బొగ్గులో ప్రవేశిస్తుంది. ఈ సమీపించిన అగ్ని, బొగ్గుకు మధ్యలోపల ఫేను మనం విసరాలి. ఈ ఫేను విసిరేటప్పటికి బొగ్గు పూర్తి అగ్నిగా మారిపోతుంది. కాబట్టి భగవంతునికి సమీపము కావాలి. భగవంతుని అభీష్టమనే గాలి వీచాలి. యిదే near and dear. ఈ రెండూ వుండిన దైవత్వాన్ని పొందుతావు. Near గా వుండికూడను dear లేకపోతే చెరువులో కప్పలవలె వుంటున్నాం. కప్పలు తామరపుష్పాలపైన వుంటున్నాయి. కానీ, దానిలో వున్న మకరందమును అవి గ్రోలటంలేదు. దూరమునుంచి వస్తున్నాయి. ఆర్జంటైనా, ఆస్ట్రేలియా, అమెరికా మొదలగు దూరప్రాంతాలనుండి వస్తున్నాయి, తుమ్మెదలు. మకరందాన్ని గ్రోలి పోతున్నాయి. Near మీలోన, dear వారిలోనా వుంటున్నాది. కనుక, near and dear రెండూ మీలోనే వుంటుంటే 'బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి.' ఏకత్వం పొందుతుంది.

### విద్యార్థులు విద్యార్థులుగా ఉండాలిగాని విషయార్థులుగా ఉండరాదు

దూరమునుండి వచ్చినవారు 'ఆహా! విద్యార్థులు ఎంత అదృష్టవంతులు! స్వామి వారితో మాట్లాడుతూ వారితో తిరుగుతూ వారితో వున్నారు,' అనుకుంటారు. వారు, ఎవరికి

సమాపములో వున్నారనేది తెలుసుకోలేకపోతున్నారు. యీ అంతరార్థమును మీరు చక్కగా గుర్తించండి. ఒక చిన్న ఉదాహరణము వుంటున్నాది. త్యాగరాజు చెప్పాడు. ఒకానొక సమయములోపల యీ త్యాగయ్యకు చాలా చిక్కులు వచ్చాయి. అనేక హింసలకు గురైపోతూ వచ్చాడు. యితనిని అనేక విధములుగా హింసిస్తూ వచ్చారు. అప్పుడు త్యాగయ్య యోచించాడు, 'నాలో భక్తి లేదా లేక రామునిలో శక్తిలేదా? నిజంగా నాలో భక్తి వుంటే యీ కష్టాలు నన్ను బాధించవే! నిజముగా రాములలో ఆ శక్తివుంటే నాకు కష్టాలు పెట్టడే, నాలో భక్తి వున్నది, కానీ, రామునిలో శక్తి లేద'నుకున్నాడు. కష్టాలు వచ్చినప్పుడు యీ విధమైన నిష్ఠూరములాడుతారు, భక్తులు. యోచించాడు. రామునిలో శక్తిలేదా? వ్రాశాడు.

**కపి వారధి దాటునా?**
**కలికి రోట కట్టునా?**

రామునిలో అంతశక్తి లేకపోతే కోతియైన హనుమంతుడు అంత సముద్రమును దాటగలడా? యశోద ఎంత ప్రయత్నించినా కానీ రోటికి కట్టలేకపోయింది, చిన్ని కృష్ణుని. నిజంగా భగవంతునికే శక్తి లేకపోతే యీ కార్యాలకు అతీతంగా తాను వుండగలడా? అంతేకాదు:

**లక్ష్మీదేవి వలచునా? లక్ష్మణుండు కొలచునా?**

లక్ష్మీదేవి ప్రపంచమునంతా అనుగ్రహించే దేవి. సమస్త శక్తులు అనుగ్రహించే దేవి. ఆమె యీ యొక్క పరమాత్మను మెచ్చి వరిస్తుందా? పరమాత్మునిలో యీ శక్తే లేకపోతే లక్ష్మి వరిస్తుందా? కాదు, కాదు, అతనిలో శక్తి వుంది. ఆ తరువాత మళ్ళీ

**సూక్ష్మ బుద్ధిగల భరతుడు చూచి చూచి మ్రొక్కునా**
**అప్ప రామశక్తి ఎంతో గొప్పరా!**

నీ శక్తి మహా గొప్పది స్వామీ! అని నమ్మకంగా పలికాడు. నా బలహీనతవల్ల నిన్ను ఆ విధంగా దూషించాను. యిది నా బలహీనతే! అని చివరకు ఒక నిర్ణయానికి వచ్చాడు. స్వామిలో యీ శక్తి లేకపోతే భక్తులు అర్జంటైనానుంచి రావలెనా? ఆస్ట్రేలియానుండి

sri sathyasai vachanamrutam

రావలెనా? ఎవరికి ఇన్విటేషన్ యిచ్చాము? నీ తెలివికంటే వారి తెలివి తక్కువ అయినదా? నీ తెలివితేటలు వారి తెలివితేటలకంటె ఉత్తమమైనవా? కాదు, కాదు. సర్వము త్యాగముచేసి ధనమునకు లెక్కపెట్టక అనుకూలములకు, సుఖములకు లెక్కపెట్టక వస్తున్నారంటే వారికి ఎంత భక్తి ప్రపత్తులు ఉండాలి? కనుక, త్యాగరాజువలె మీరు మీ అభీష్టములు నెరవేరలేదని బలహీనత పడకూడదు. దైవత్వముపైన దోషములు వేయకూడదు. ఏ శక్తి లేకపోతే ఇన్ని దేశములనుంచి యిక్కడకు వస్తారు? వివిధ మతములవారు యీ విధముగా ఏకత్వము చెందుతారా? ఈ రకమైన విచారణ చేస్తూ వస్తే మీ అల్పత్వము బయట పడిపోతుంది. మీ అల్పత్వమే యీ విధమైన స్వల్ప భావాలకు బంధితమై పోతున్నాది. కనుక, అధిక భావాన్ని, ఉత్తమమైన భావాన్ని, విశాలమైన భావాన్ని పెంచుకుంటూ రావాలి.

మన విద్యార్థులందరు Sri Sathya Sai Institute of Higher Learning నందు ఉత్తీర్ణులైనవారు ఎక్కడకు పోయినప్పటికి ఆదర్శ ప్రాయులుగా ఉంటుండాలి. విద్యార్థులు విద్యార్థులుగా వుండాలిగాని విషయార్థులుగా వుండరాదు. బయట ప్రపంచములోని విద్యార్థులకు, మన విద్యార్థులకు పూర్తి భిన్నముగా వుంటున్నాది. మనము సర్వులను గౌరవించాలి. కేవలము అల్ప బుద్ధులకు అవకాశము యిచ్చి ఏ విధమైన చెడ్డపేరుకు మనం గురికాకూడదు.

**విద్యార్థులు సంస్థయొక్క గౌరవమును నిలబెట్టడానికి ప్రయత్నం చెయ్యాలి**

విద్యార్థులారా! మీకు మార్కు లేకపోయినా ఫరవాలేదుగానీ రిమార్కు మాత్రం తెచ్చుకోకూడదు. 'ఫలానా విద్యార్థి యిలాంటి సత్కీర్తిని సాధించాడు' అనే పేరు తెచ్చుకోవాలి. ఏ విధంగా మీరు గేమ్సులోపల గొప్ప గొప్ప ఉత్తీర్ణులై పోయి ఉత్తమ ప్రైజులందుకున్నారో అదే విధముగనే స్వామి దగ్గరనుంచికూడా మీరు 'మంచి పిల్లవాడు' అనే బిరుదునందుకోటానికి ప్రయత్నించండి. లోకములో అనేక బిరుదులిస్తున్నారు. 'పద్మశ్రీ', 'పద్మవిభూషణ్' యింకా యేమో యిస్తున్నారు. అవి కాదు, మనకు బిరుదులు. 'శ్రుణ్వంతు విశ్వే అమృతస్య పుత్రః', నీవు అమృత పుత్రుడవు నాయనా! అనాలి. కేవలం సామాన్యమైన పిల్లలుగా మీరు ప్రవర్తించరాదు. ఆదర్శవంతమైన పిల్లలుగా మీరు ప్రవర్తించాలి. ఏవో కొన్ని దోషాలు కలుగుతూవుంటాయి,

srisathyasai vachanamrutam

తప్పులు జరుగుతూ వుంటాయి. కానీ, మనము దానికి లెక్క చేయకుండా మన సంస్థయొక్క గౌరవము నిలబెట్టటానికి తగిన ప్రయత్నం చేయాలి. అదే మీరు సంస్థకు యివ్వవలసిన కృతజ్ఞత. అట్టి కృతజ్ఞత లేనివారు అడవిలో వున్న క్రూరమృగములకంటె హీనులని చెప్పవచ్చు. ఈ సంస్థకు మాత్రమేకాదు, ఎక్కడైనా సరే, ఎవరైనా సరే, మీకు చేసిన ఉపకారము మాత్రము మీరు మరచిపోకూడదు. ఆ విధమైన కృతజ్ఞతను పెంచుకొని కృతఘ్నులు కాకుండా మసలుకోవాలి. విద్య అంతాకూడను కేవలము శ్లోకములవలె ఉచ్చరించడం లేక శ్లోకాలు చదివి అర్థాలు వల్లిస్తూ నేను పండితుడననే అహంకారము పెంచుకోవద్దు. ఆచరణరూపమైన విద్యలు మీరు అభ్యసించటానికి ప్రయత్నించండి. ఈ ఆడంబరాలు, అహంకారాలు, మమకారాలు యివన్నీ కూడను రాక్షసవిద్యలు. నిజంగా మీరు సాక్షర స్వరూపులైన విద్యావంతులు కావాలి. దీనికి సరైన ఆధారము భక్తి మాత్రమే! భగవంతుని హృదయములో ప్రతిష్ఠించుకుని అన్నింటికి అతన్నే కేంద్రముగా వుంచుకొని అన్ని మార్గములు అతనినుంచే ప్రారంభము కావాలి. అప్పుడే యీ పవిత్రమైన భావాలు మనలో ఆవిర్భవిస్తాయి.

## Science గొప్పది కాదు, Sense గొప్పది

విద్యార్థులారా! నిమిత్తమాత్రంగా యీ స్పోర్ట్సు జరుగుతూ వచ్చాయి. శరీరమునకు ఆరోగ్యము కావాలి. ఆరోగ్యమైన శరీరములో ఆరోగ్యమైన మనస్సు వుంటుంది. ఆరోగ్యమైన మనస్సు ఆరోగ్యమైన ఆనందాన్ని అందిస్తుంది. ఈ ఆనందమే దైవస్వరూపకంగా మారిపోతుంది. కాబట్టి శరీరముద్వారా మనస్సును అనుసరించి మనస్సును మాధవునియందు అంకితముగావించినప్పుడు యీ మూడింటి యేకత్వమే

**త్రిదళం త్రిగుణాకారం త్రినేత్రంచ త్రియాయుధం**
**త్రిజన్మ పాపసంహారం ఏకబిల్వం శివార్పణం.**

బిల్వపత్రంలో వుండినట్లుగా మనం యీ మూడు ఏకం చేయాలి. ఈనాడు లోకములో ఎంతో విద్యావంతులుంటున్నారు. ఎందరో వైజ్ఞానికులు వుంటున్నారు. కానీ, వారికి ఏమాత్రం సుఖశాంతులు లేవు. ఎంత గొప్ప గొప్ప యంత్రాలను తయారు చేస్తున్నారు! Atom Bomb, Hydrogen Bomb యింకా ఏవేవో చేస్తున్నారు. కానీ, యీ బాంబులన్నీ

వారినే భయపెడుతున్నాయి. ఇదికాదు చేయవలసినది. ఏకత్వంగా వుండి యీ యంత్రములంతా దూరము చేసి అన్ని విధాలా త్యాగము చేసినప్పుడే నీకు నిజమైన అభయత్వము ప్రాప్తిస్తుంది. కేవలము హృదయమే పాషాణంగా వుండిన చర్చిల్‌కూడను కట్టకడపటికి ఎంతో విచారణ చేసుకున్నాడు. బ్రిటీషు యుద్ధములోపల శవాలంతా పడిపోతే శవాలపైనంతా బూట్సు కాళ్ళతో నడిచాడు, యేమాత్రం భయభ్రాంతులు లేకుండా! అలాంటివాడు కట్టకడపటికి ఆటంబాంబు, హైడ్రోజనుబాంబు, యీ బాంబులయొక్క ప్రభావమును చక్కగా గుర్తించుకొన్నాడు. చివరకు 'మానవుడు అన్నింటిని తెలుసుకుంటున్నాడు; కాని, తనను తాను తెలుసుకోటంలేదే' అని విచారించాడు. యిదే అర్థములో ప్రహ్లాదుడు కూడను చెప్పాడు. తండ్రి దగ్గరకు వెళ్లి నాయనా!

**"లోకములన్నియున్ ఘడియలోన జయించినవాడవింద్రియా**
**నీకము చిత్తమున్ గెలువనేరవు"**

ఏమి ప్రయోజనము? చిన్న విద్యార్థి ప్రహ్లాదుడు. గొప్ప శక్తి కలిగిన సైంటిస్టు, హిరణ్యకశిపుడు. యీనాటి సైంటిస్టులు హిరణ్యకశిపుని దగ్గర 'వుఫ్' అంటే వూగిపోతారు. ఎంత పరిశోధనలు చేశాడు, హిరణ్యకశిపుడు! ఎన్ని విధములైన వాటిని సాధించాడు! అలాంటి సైంటిస్టుని యీ చిన్న పిల్లవాడు యీలాంటి question వేశాడు. దాంతో అతని సైన్సు అంతా senseless గా మారిపోయింది. సైన్సు గొప్పది కాదు; మన sense గొప్పది. సైన్సు పైకి పోతున్నాది. కాని మన sense అధోగతి పాలైపోతున్నాది. కనుక, sense ను పైకి పంపించాలి. సైన్సును కాలిక్రింద తొక్కాలి. యీ సైన్సుకూడా చాలా గొప్పదే, కానీ, దానికి ఒక limit అంటూ వుంటున్నాది. మితి మీరిపోతే అన్నీ మతి తప్పిపోతాయి.

మీ కందరికి తెలుసు, రష్యా ఎంత పేరు పొందినదో! ప్రపంచములో అన్నింటికంటె వున్నత స్థాయి పొందినది. కాని యీనాడు ఛిన్నాభిన్నమైపోయి తినటానికి తిండిలేదు ఆ దేశములో. యిప్పుడు ముస్లిమ్ రాజ్యాలకు ఆయుధాలు అమ్ముకుని తింటున్నారు. నేను ఎన్ని సంవత్సరములకు పూర్వమో చెప్పాను. 'కమ్యూనిష్టు రాజ్యమని కాదు, come you next ' అన్నాను. ఒకనాటికి తిరిగి వారుకూడా ఇక్కడికి వస్తారు. ఈనాడు యీ విధంగా

sri sathyasaivachanamrutam

పూర్తిగా పతనమై పోతున్నారు. దీనికి కారణము ఏమిటి? అహంకార, అభిమాన, మమకారములే కారణము. ఇవి యేనాడైనా మానవుని అధఃపతనము చేస్తాయి. వినయవిధేయతలు కావాలి. అదే విద్యయొక్క సరైన సారము. ఈ వినయ విధేయతలు రావాలంటే భగవద్విశ్వాసము రావాలి. ఆ విశ్వాసము లేకపోతే ఏమీ మనము సాధించలేము.

**భగవద్విశ్వాసమును పెంచుకోండి!**

కనుక, విద్యార్థులారా! భగవద్విశ్వాసమును పెంచుకోండి. ఏ కార్యములో మనము ప్రవేశించినప్పటికి యిది భగవంతునికి సమ్మతమైన పనియా లేక విరుద్ధమైనదా అని విచారించాలి. దానికి హితమైన రీతిని అనుసరించండి. మీయొక్క జీవితాన్ని ఆదర్శ జీవితంగా రూపొందింపచేస్తుంది. కన్న తల్లితండ్రులకు, వున్న సమాజానికి, పుట్టిన దేశమునకు సత్కీర్తి తెండి.

ఈనాడు అన్ని కేంపస్‌లవారు అనగా అనంతపురం, బెంగుళూరు, పుట్టపర్తి, ప్రైమరీస్కూలు యీ నాలుగు కేంపస్‌లలోని విద్యార్థులు ఎంతో అద్భుతంగా ఆనందంగా ఆకర్షణీయంగా ప్రజలను ఆనందపరిచారు. ఈ క్రీడోత్సవములో పాల్గొన్న ఒక్కొక్క వ్యక్తికి వారి వారి అర్హతలను బట్టి వ్యక్తిగతమైన ప్రైజులు అందించాము. కానీ, సమిష్టి ప్రైజులు యివ్వాలని నేను సంకల్పించుకున్నాను. లోకములో యిటువంటి ఆటలపోటీలకు కోట్లు ఖర్చు పెడుతుంటారు. కానీ, మన Institute కి సంబంధించిన సంస్థలలో ఒక నయాపైసా ఖర్చులేదు. రిబ్బన్లతో కాగితాలతో బంతులతో యింత సులభంగా చక్కని ప్రదర్శనలందిస్తూ వచ్చారు. యిలాంటి చిన్న చిన్న పదార్థములతో ఒక్క రూపాయి పదార్థములోపల వేలరూపాయల ఆనందమునందిస్తూ వచ్చారు. యింతే కాకుండా, చిన్న పిల్లలు పుష్పములవంటివారు. 5వ సంవత్సరము పిల్లలుకూడను ఒక ఆయా గానీ ఒక టీచరుగానీ యింకో physical Instructor గానీ ఎవరూ లేకుండా వారికి వారే వచ్చి formation చేయటము ఎంత తెలివితేటలతో చేశారు! పెద్దలందరికి చక్కని ఆదర్శమునందిస్తూ వచ్చారు. మన కాలేజీ పిల్లలు అద్భుతాన్ని, ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలిగించుతూ వచ్చారు.

srisathyasaivachanamrutam

అందరూ భయభ్రాంతులయ్యే ఆటలు యిందులో ప్రవేశపెట్టారు. యింక అనంతపురం కాలేజీ పిల్లలు. ఒక్క మగదిక్కులేదు వారికి. అన్నీ వారే స్వయంగా చేసుకొని ఆ పిల్లలకు తగిన ఉత్సాహప్రోత్సాహములనుకూడను అధ్యాపకులు అందిస్తూ యింత విచిత్రంగా యింత అద్భుతంగా చేశారంటే యిది కేవలము వారికి స్వామిపై వున్న భక్తి ప్రపత్తులే దీనికి మూలకారణము. స్వామిని సంతోషపెట్టాలనేదే వారి లక్ష్యము. యిది మరొక ప్రదేశములో చేయటానికి యేమాత్రము వీలుకాదు. మోటారు సైకిలుపైన వస్తుంటే కుక్కవస్తే దానిని తప్పించుకోటం కష్టమవుతుంది. అలాంటిది పెద్ద వాలుబల్లపైన ఎక్కి దుమకటం, కారును కూడను రేంప్పైన దూకటము, యిది ఆశ్చర్యకరమైన విషయము! యింక మన ప్రశాంతినిలయం కేంపస్ పిల్లలుకూడను అద్భుతమైన ప్రదర్శనలు ఇచ్చారు. అంతా అగ్నిమయంగా ఉంటుండినాది. అగ్నిలోనే పుట్టి అగ్నిలోనే పెరిగి అగ్నిలోనే ఆడి అగ్నిలోనే అంత్యమై పోయింది. కనుక వీరియొక్క చర్యలు వీరి ఆటలను బట్టి వాటికి ఒక చిహ్నంగా ప్రైజులు యివ్వాలని నేను సంకల్పించుకున్నాను. ప్రైమరీస్కూలు పిల్లలు వచ్చి యీ ప్రైజు అందుకోవలసింది. అనంతపురం కేంపస్, బృందావన్ కేంపస్, ప్రశాంతినిలయం కేంపస్ విద్యార్థులుకూడా ప్రైజులు అందుకోండి.

**(తేదీ 14-01-1992న ఇన్స్టిట్యూట్ ఆడిటోరియంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam